

డీసీల ఏర్పాటులో విఫలం

ఇస్కాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం



- నిర్వహణ లోపంతో రైతుల మధ్య ఘర్షణ వాతావరణం
- రూ. కోట్లు వెచ్చించినా అందని సాగు నీరు
- బీడుగా మారిన పంట పొలాలు

పాములపాడు, జనవరి 4 : రైతుల బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో 2018లో సుమారు 20 కోట్ల రూపాయలు వెచ్చించి ఎస్ఆర్ఎంసీ కాలువ అనుసంధానంగా లిఫ్ట్ ఏర్పాటు చేసింది. దీని వల్ల దాదాపు రెండు వేల ఎకరాలకు సాగు నీరందించేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అధికారులు డీసీలు సరిగా ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు సాగు నీరు అందడం లేదు. పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామం రైతాంగానికి సాగు నీరందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదలశాఖ ద్వారా ఇస్కాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు చేశారు. 750 మంది రైతులకు సంబంధించి రెండు వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు 20 కోట్ల రూపాయలు వెచ్చించి లిఫ్ట్, 76 డీసీలు ఏర్పాటు చేశారు. 150 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లను ఏర్పాటు చేశారు. అయితే ట్రైల్ రన్‌లో భాగంగా నీరు విడుదల చేయగా 50 డీసీలకు మాత్రమే నీరు స్వల్పంగా ప్రవహించింది. మిగతా వాటికి నీరందలేదు. పొలాలు ఎత్తులో ఉండటం, డీసీలు తగ్గులో ఉండటం వల్ల నీరు అందడం లేదని, దీనికి అధికారుల తప్పిదమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించినా తమకు సాగునీరందడం లేదని రైతులు ఆందోళనలు చెందుతున్నారు. అధికారులు నీటిని వదిలినప్పుడు కేవలం ఆరు డీసీలలో మాత్రం నీరు వస్తున్నదని, దీంతో కేవలం వంద ఎకరాలకు నీరు అందుతున్నదని, మిగతా పొలాలన్నీ బీడుపడ్డాయని రైతులు అంటున్నారు. అన్ని డీసీల ద్వారా నీరు వదలకపోవడంతో రైతుల మధ్య ఘర్షణ వాతవరణం తలెత్తింది. దీనిపై రైతులు ఇరిగేషన్ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా ట్రైల్ రన్‌లో 50 డీసీలకు నీరందిందని మిగతా 26 డీసీలను పరిశీలించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి రాబోయో ఖరీఫ్‌లో ప్రతి ఎకరాకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



అధికారులు డీసీలను సరిగా ఏర్పాటు చేయలేదు. పొలాలు ఎత్తులో ఉంటే తగ్గులో డీసీలను ఏర్పాటు చేశారు. దీంతో నీరు సరఫరా కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణం.

నాగలక్ష్మిరెడ్డి, రైతు, ఇస్కాల గ్రామం



ఇస్కాల గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన డీసీలు

రూ. 20 కోట్లు వెచ్చించినా నీరందడం లేదు



ప్రభుత్వం కోట్లు వెచ్చించినా అధికారుల నిర్లక్ష్యం వల్ల సాగు నీరందక వందల మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నీటి తొట్ల ఏర్పాట్లలో డిజైనింగు సరిగా లేకపోవడంతో పొలాలకు నీరందడం లేదు. సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-శంకర్‌రెడ్డి, రైతు, ఇస్కాల గ్రామం

చీకటి చట్టంపై పోరాడాలి

- విభజన చట్టం మేరకు ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- ప్రభుత్వంపై రాజకీయ పార్టీలు ఒత్తిడి తేవాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జనవరి 4 : రాయలసీమ ప్రాంత సాగు నీటి హక్కులకు, ఏపీ సాగునీటి హక్కులకు విఘాతం కలిగిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 6న తీసుకొని వచ్చిన చీకటి చట్టం రద్దుకు వైసీపీ ప్రభుత్వం ముందుండి పోరాడాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కేంద్ర కార్యాలయంలో సమితి ఉపాధ్యక్షుడు ఏర్వ రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన ఉద్యమం సందర్భంగా మోపిన కేసులో ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గురువారం విడుదలయ్యాక, తన అరెస్టుకు నిరసనగా రాయలసీమ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఆందోళనలు, నిరసనలు చేపట్టిన ప్రజాసంఘాలకు, రైతు సంఘాలకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపేందుకు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన అరెస్టును ఖండించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. రాయలసీమకు బచావత్ ట్రిబ్యునల్, ఏపీ విభజన చట్టం కల్పించిన నీటి హక్కులకు భంగం కలిగిస్తున్న చీకటి చట్టం రద్దుకు అన్ని రాజకీయ పార్టీలు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, తుంగభద్ర వరద కాలువ, వేదవతి ఎత్తిపోతల పథకం, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ నిర్మాణాలను చేపట్టేలా అన్ని రాజకీయ పార్టీలు తమ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలోచ చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి కార్యాచరణ ఉండాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, వెలుగొండ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వంపై అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి తెచ్చేలా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణకు ఎమ్మెల్యే కృషి చేయాలి: బొజ్జా దశరథరామిరెడ్డి

రాయలసీమ సాగునీటి, ఇతర మౌలిక వసతుల కోసం రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాలు చేస్తున్న పోరాటాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి కొనియాడడాన్ని స్వాగతిస్తున్నామని దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. దేశ వ్యాప్త గుర్తింపు కలిగి, వివిధ పంటల్లో ఎన్నో రకాల కొత్త వంగడాలను సృష్టించిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణకు ఎమ్మెల్యే కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

కలెక్టర్ మనజీర్‌జిలానీ సమూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్‌జిలానీసమూన్, ఇతర అధికారులు

నంద్యాల (కల్చరల్), జనవరి 4: జిల్లాలోని చెంచులను అభివృద్ధి చేసి జీవన ప్రమాణాలు పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై గిరిజన ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తోపాటు ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, సంబంధిత 14 మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మనజీర్‌జిలానీ సమూన్ మాట్లాడుతూ జిల్లాలోని 14మండలాల పరిధిలోని 42 చెంచుగూడేలలో దాదాపు 8,750 మంది గిరిజనులు నివసిస్తున్నారని, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం దిగిరావాల్సిందే

- అంగన్‌వాడీల ఆగ్రహం
- జీఓ ప్రతులను దహనం చేసి నిరసన



జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 4: న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో జగన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడంపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చేవరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసిన జీఓ ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యాడన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని సాగనంపుతామని హెచ్చరించారు. నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దున్నపోతుపై వాన పడినట్లు ఉందన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకూ సమ్మెను విరమించేప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ముందస్తు అరెస్టు



నంద్యాల టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు

నంద్యాల క్రైం, జనవరి 4 : సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. సమగ్ర శిక్ష విభాగంలో బోధన, బోధనేతర సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా జేఏసీ పిలుపు మేరకు 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అమరావతిలో ఉన్న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయ ముట్టడికి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి విజయవాడకు వెళ్లకుండా, ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు నంద్యాల పట్టణంలోని కొంతమంది సమగ్ర శిక్ష ఉద్యోగులను అదుపులోకి తీసుకొని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం మహిళా ఉద్యోగులను కూడా స్టేషన్‌కు పిలిపించి గంటపాటు ఉంచి సొంత పూచీకత్తుపై పంపించారు.

రైతులకు నీరివ్వలేం: ఎమ్మెల్యే శిల్పా



బండిఆత్మకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బండిఆత్మకూరు, జనవరి 4 : రైతులు తన వైపు దీనంగా చూసినా సరే.. రబీకి నీరివ్వలేమని ఎమ్మెల్యే ఖారాఖండిగా అన్నారు. గురువారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 20 గ్రామాలకు మంజూరైన 96 కొత్త పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రబీలో నీటి సరఫరా కోసం ఎదురు చూస్తున్నారని, ఇది కలలో కూడా జరగదని తేల్చి చెప్పారు. దీంతో రైతులు నిరాశకు గురయ్యారు. అనంతరం అక్కడి నుంచి ఎమ్మెల్యే ఈర్నపాడు గ్రామం వెళ్ళి అక్కడ ఆర్బీకే, సీసీ రోడ్డు, మురుగు కాల్వ పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వెంట శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అహోబిలంలో ధనుర్మాస పూజలు



ప్రహ్లాద వరదస్వామికి గ్రామోత్సవం చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 4: అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. అహోబిలం ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అమ్మవార్లకు అర్చకులు అభిషేకం నిర్వహించారు. గోదాదేవి అమ్మవారిని మాడవీదుల్లో గ్రామోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులకు పీఠాధి పతి పూజలు చేశారు. అనంతరం రాపత్తు అధ్యయనోత్సవం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు 7న

నంద్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10 గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. టౌన్ హాల్ సమీపంలోని కేఎస్ఎం (కదరాబాద్ నర్సింగరావు మెమోరియల్) మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 70759 06669, 98492 13606 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ

ధనుర్మాసం పురస్కరించుకుని నంద్యాల సంజీవనగర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరుప్పావడ సేవను ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ శర్మ, తరుణ్‌కుమార్ శర్మలు శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. డాక్టర్ దివి హయగ్రీవాచార్యుల విశ్లేషణతో, అర్చకులు గోవిందనామాలతో, వేదవచనాల నడుమ తిరుప్పావడ సేవను కొనసాగించారు. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన పులిహోరను రాశిగా పోసి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, తదితరులు పాల్గొన్నారు. -నంద్యాల (కల్చరల్)

శ్రీవారి రూపంలో రాశిగా పోసిన పులిహోర నైవేద్యం



కాటసాని అడ్డాలో వైసీపీ సభకు జనం కరువు

- సామాజిక సాధికార బస్సు యాత్ర తుస్సు
- నేతలు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం



సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


కర్నూలు(అర్బన్), జనవరి 4: సామాజిక సాధికార సభ పేరుతో వైసీపీ జనసమీకరణ చేస్తున్నా ఆ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ కరువవుతోంది. గురువారం నగరంలోని చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభ మరోసారి తుస్సుమంది. సీనియర్ ఎమ్మెల్యేగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చక్రం తిప్పుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి సొంత నియోజకవర్గంలో బస్సుయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఊహించినదానికంటే జనం తక్కువగా రావడం, వచ్చిన వాళ్లు కూడా వైసీపీ నేతల ప్రసంగాలు చేస్తుండగానే వెనుదిరిగివెళ్లిపోయారు. సభ ప్రారంభమైన అరగంటకే కుర్చీలు ఖాళీ కావడంతో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌కు చెందిన ప్రధాన అనుచరుడు గుర్తించి వలంటీర్లను అప్రమత్తం చేసేందుకు ప్రయత్నం చేశారు. గడివేములు, పాణ్యం మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు కీలక నాయకులు ఆపసోపాలు పడ్డారు. సాయంత్ర 5 గంటలకు చెన్నమ్మ సర్కిల్‌లో సభా ప్రాంగణానికి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వేదికపైకి చేరుకోగానే ప్రజలకు అభివాదం చేసేందుకు పోటీ పడ్డారు. కానీ ప్రజల నుంచి స్పందన కరువైంది. కీలక నాయకులు మాట్లాడుతుండగానే ఖాళీ అయిన కుర్చీలను వైసీపీ కార్యకర్తలే తొలగించడం కొసమెరుపు.



ఆదాయం కోసం అడ్డ దారులు..!


- వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో దోపిడీ
- బయటి ల్యాబ్‌లకు రాస్తున్న వైద్యులు
- చెప్పిన చోటే చేయించాలని హుకుం
- లేదంటే వైద్యం చేయని వైనం
- ఓ చిన్నారి విషయంలో తేటతెల్లం
- గైనిక్ వార్డులోనూ ఇదే పరిస్థితి
- చర్చనీయాంశంగా మారిన ఓ ఉద్యోగి తీరు
- ఆవేదనకు గువుతున్న పేదలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 4: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రాసే వైద్య పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లకు సిరులు కురిపిస్తున్నాయి. కొందరు వైద్యులు కమీషన్ కోసం.. ల్యాబ్‌ల యజమానులు ఆదాయం కోసం పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామీణ ప్రాంత రోగులే టార్గెట్‌గా కొందరు వైద్యులు, పీజీలు, హౌస్ సర్జన్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వాటాలు తీసుకుంటూ దందా సాగిస్తున్నారు. తాము చెప్పిన ల్యాబ్‌లోనే పరీక్షలు చేయించాలని చీటీలు రాసి పంపుతున్నారు. వేరే ల్యాబుల్లో పరీక్షలు చేయిస్తే వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నారు. గైనిక్ ఓపీలో ఓ మహిళా ఉద్యోగి టెస్టులు బయటకు రాసి పంపుతూ ప్రతి రోజూ రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నట్టు సమాచారం. చివరకు సెక్యూరిటీ గార్డులు కూడా ఇదే పద్ధతికి అలవాటు పడినట్టు తెలుస్తోంది. దీన్ని బట్టి కర్నూలు ప్రభుత్వాసుపత్రి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నా బయటకు రాసి పంపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఉషా ల్యాబ్‌కు రాసిన పరీక్షలు





రాయలసీమ ల్యాబుకు రాసిన పరీక్షలు

కర్నూలు జీజీహెచ్‌కు రాయలసీమలోనే మంచి పేరు ఉంది. ఇక్కడికి రాయలసీమలోని కడప, అనంతపురం జిల్లాలతోపాటు, ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతం నుంచి కూడా రోగుల వస్తుంటారు. అలాగే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రోగులు కూడా ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో ఓపీకి ప్రతి రోజూ మూడు వేల మంది వస్తుండగా ఇందులో 300 మంది అడ్మిషన్ పొందుతున్నారు. ఆసుపత్రిలో 1050 పడకలు ప్రభుత్వం మంజూరు చేయగా, 1500 మంది రోగులు అడ్మిషన్‌లో ఉంటున్నారు. ఇంత పెద్దాసుపత్రిలో వైద్య పరీక్షల కోసం ప్రతి నెలా రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు పెడుతున్నా ప్రైవేటు ల్యాబ్‌ల దోపిడీ మాత్రం ఆగడం లేదు.

● ఆ రెండు ల్యాబ్‌లకే..!

ఆసుపత్రి ఎదుట బుధవారపేటలో ఉన్న రెండు ల్యాబ్‌లకే ఎక్కువగా రోగులను పంపిస్తున్నట్టు సమాచారం. ఇక్కడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించిన పరీక్షల ధరలకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. పీడీయాట్రిక్ విభాగం మొత్తం బుధవారపేటలో ఉన్న ఓ ల్యాబ్‌కు పరీక్షలు రాస్తుండగా.. ఏఎంసీ, క్యాజువాల్టీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గైనిక్, సర్జరీ వార్డులు ఇక్కడే ఉన్న మరో ల్యాబ్‌కు రాసి ఇవ్వడం గమనార్హం. సాధారణ ధరల కంటే అధికంగా రోగుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. అత్యవసర ఆపరేషన్ చేయాలంటే బయట నుంచి పరీక్షలు చేయించుకొని రావాలని కొందరు వైద్యులు, జూనియర్ డాక్టర్లు రెఫర్ చేస్తున్నారు. ఇదే అదునుగా అర్హత లేని కొన్ని ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. ఆసుపత్రి గేటు వద్ద దళారులను నియమించుకొని రోగులను తమ ల్యాబ్‌లకు తరలించుకుపోతున్నాయి. అత్యవసరం పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్నాయి.

గైనిక్ ఓపీలో థైరాయిడ్ టెస్టు బయటకు..

గైనకాలజీ విభాగంలోని ఓపీ విభాగంలో గర్భిణులకు ఎంతో ముఖ్యమైన థైరాయిడ్ పరీక్షలు బయటకు వెళ్తున్నాయి. గైనిక్ ఓపీలో ఉన్న ఓ మహిళా ఉద్యోగి ప్రైవేటు ల్యాబ్‌లతో కుమ్మక్కు కావడంతో ప్రతి రోజూ ఈ టెస్టులు బయటి వెళ్లిపోతున్నాయి. ప్రతి రోజూ గైనిక్ ఓపీకి 200 నుంచి 250 మంది సాధారణ రోగులు వస్తుంటారు. ఇందులో 40 మంది అడ్మిషన్ పొందుతుంటారు. గర్భిణుల అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని ఓ మహిళా ఉద్యోగి ప్రైవేటు ల్యాబ్ సిబ్బంది ఫోన్ నెంబర్ ఇచ్చి బయట చేయించుకోవాలని తెలియజేస్తోంది. ప్రతి రోజూ 50 నుంచి 60 థైరాయిడ్ టెస్టులను ఈ ఉద్యోగి బయటకు పంపుతోంది. ల్యాబ్‌లో థైరాయిడ్ టెస్టు ఒకటి రూ.500. ప్రైవేటు ల్యాబ్‌కు థైరాయిడ్ టెస్టులను పంపడం వల్ల ప్రతి రోజూ ఆ ఉద్యోగికి రూ.3 వేల నుంచి రూ.4 వేలు కమీషన్ వస్తుంది. ఏళ్ల తరబడి గైనిక్ ఓపీ కేంద్రంలో ఉండటం కోసం ప్రతి నెలా నర్సింగ్ ఆఫీసుకు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

దందా సాగేది ఇలా...

రోగి పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లో రూ.1000 అయితే.. ఈ టెస్టుకు బయటకు రాసిన పీజీ, హౌస్ సర్జన్‌లకు రూ.500 కమీషన్ వస్తుంది. అంటే ప్రతి వ్యాధి నిర్ధరణ పరీక్షకు కొందరు పీజీ, మరికొందరు హౌస్ సర్జన్లకు 50 శాతం కమీషన్‌ను ల్యాబ్ నిర్వాహకులు ముట్ట జెబుతున్నట్లు సమాచారం. ప్రతి నెలా 1వ తేదీ జీతం వచ్చినట్లే వీరికి ల్యాబ్‌ల నుంచి కమీషన్ వస్తున్నట్టు తెలుస్తోంది. ల్యాబ్‌ల నిర్వాహకులు నేరుగా ఆసుపత్రిలోని వార్డులకు వచ్చి పీజీలు, హౌస్ సర్జన్లకు కమీషన్‌ను ఇస్తారు. ఇక కొందరి పీజీలు, కొందరు హౌస్ సర్జన్లకు సంబంధించిన కార్లు, బైకు ఈఎంఐలు ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు కడుతున్నట్టు సమాచారం. దీన్ని పరిస్థితి ఇంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ దందాపై విజిలెన్స్ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.



ఆ ల్యాబ్‌లో చేయిస్తేనే వైద్యం

దాదాపు 35 రోజుల క్రితం చిన్న పిల్లల విభాగంలోని పీఐసీయూలో ఎమ్మిగనూరు ప్రాంతం నుంచి వచ్చిన ఓ చిన్నారిని అడ్మిషన్ చేయించారు. ఏడు నెలలకే ఆడ శిశువు జన్మించడం వల్ల ఆ చిన్నారికి ఊపిరి తీసుకోలేకపోవడం, హార్ట్‌బీట్ తక్కువ సమస్యలు తలెత్తాయి. ఆ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఓ పీజీ పేటలో ఉన్న ల్యాబ్‌లో టెస్టులు చేయించుకోవాలని బుధవారం రాసి పంపించారు. అయితే ఆ చిన్నారి తండ్రి పీజీ చెప్పిన ల్యాబ్‌లో కాకుండా పక్కన ఉన్న ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించారు. ఆ రిపోర్టులను తెచ్చి పీజీకి ఇవ్వడంతో వాటిని చించి వేసి ముఖం మీద కొట్టారు. చిన్నారి తండ్రిపై కోపంతో ఊగిపోయారు. తాను చెప్పిన ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తేనే వైద్యం చేస్తానని చెప్పడంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు నివ్వెరపోయారు. పీజీ డాక్టర్ ఇంత కఠినంగా వ్యవహరించడం బాధ వేసిందని, డబ్బులు తక్కువగా ఉన్నాయని, అందుకే మరో ల్యాబ్‌లో టెస్టులు చేయించుకున్నామని వారు వాపోయారు. పేదలు కావడం వల్లే తమను చిన్న చూపు చేశారని తోటి రోగుల బంధువుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పీజీ చెప్పిన ల్యాబ్‌లో టెస్టు చేయించుకున్న తర్వాతనే వైద్యం జరిగింది.

టెస్టులు బయటకు పంపకూడదు

ఆసుపత్రిలో రోగుల నిర్ధారణ పరీక్షలను బయటి ల్యాబ్‌లకు పంపకూడదు. న్యూడయాగ్నోస్టిక్ బ్లాకుకు పరీక్షల కోసం ప్రతి నెలా దాదాపు రూ.25 లక్షలు ఖర్చు పెడుతున్నాం. అయినా పరీక్షలు బయటకు వెళ్తున్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతోపాటు ఆసుపత్రిలో అందుకు సంబంధించిన పరీక్షలు లేకుంటే అప్పుడు బయటకు పంపవచ్చు. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రోగుల కేసీట్‌లను పరిశీలిస్తాం.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

సెక్యూరిటీ గార్డులు సైతం..

ఆసుపత్రిలో రోగుల భద్రత కోసం నియమించిన సెక్యూరిటీ గార్డులు దళారుల అవతారమెత్తారు. ప్రైవేటు ల్యాబ్‌లు, రోగులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. రోగులకు వైద్యులు రాసిచ్చిన పరీక్షల శాంపిల్స్‌ను ప్రైవేటు ల్యాబ్ సిబ్బందికి అప్పగిస్తారు. ప్రైవేటు ల్యాబ్ సిబ్బందిని అరికట్టాల్సిన సెక్యూరిటీ గార్డులే దళారులుగా మారడం గమనార్హం. ఇందుకుగాను ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు ఐదు శాతం కమీషన్ ముట్టజెబుతారు. వీటితో పాటు వారానికోసారి మందు పార్టీ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది.

13 మంది సీఐల బదిలీ

కర్నూలు, జనవరి 4: జిల్లా వ్యాప్తంగా 13 మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ఎస్పీ జి.కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారు తక్షణమే విధుల్లో జాయిన్ కావాలని ఆయన ఆదేశించారు. బదిలీ అయిన పోలీసుల వివరాలు...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.తేజోమూర్తి	వీఆర్ కర్నూలు	ఆదోని వన్‌టౌన్
డి.గోపి	వీఆర్ కర్నూలు	ఆదోని టూటౌన్
కె.శ్రీనివాస నాయక్	ఆదోని టూటౌన్	వీఆర్, కర్నూలు
బీ.ఏ మంజునాథ్	కర్నూలు త్రీటౌన్, అటాచ్డ్ పీసీఆర్	ఆదోని ట్రాఫిక్
ఎం.పార్థసారధి	ఆదోని ట్రాఫిక్ పీఎస్	వీఆర్, కర్నూలు
ఎం.ఉపేంద్రబాబు	సీసీఎస్, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మి	సీసీఎస్, సెబ్	వీఆర్, కర్నూలు
ఎం.నాగశేఖర్	సీసీఎస్-త్రీ, కర్నూలు	వీఆర్, కర్నూలు
యు.లక్ష్మయ్య	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కళా వెంకటరమణ	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కె.శ్రీరాములు	కర్నూలు తాలుకా	వీఆర్, కర్నూలు
కె.ఎరిషావలి	వీఆర్, కర్నూలు	మంత్రాలయం
కె.శ్రీనివాసులు	మంత్రాలయం	వీఆర్, కర్నూలు

ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 4: వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారని అన్నారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాజీనామా చేసే వారిని నిలుపుకు నేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రజలకు భయపడి సొంత నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. ఎమ్మెల్యేలు ప్రజలకు సేవ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికే మరో 50 మంది అభ్యర్థులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహ బూబ్‌బాషా, నాయకులు కేవీ మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

ఇద్దరికి కత్తి పోట్లు, ఆసుపత్రికి తరలింపు

నంద్యాల క్రైం, జనవరి 4: నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా విద్యార్థుల మధ్య గ్యాంగ్‌వార్ జరిగింది. టెక్కెలోని మున్సిపల్ స్కూల్ వద్ద గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థులు కత్తి పోట్లకు గురయ్యారు. పట్టణంలోని వీసీ కాలనీలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల్లో రెండు వర్గాలు ఉన్నాయి. ఈ రెండు వర్గాల మధ్య కొంత కాలంగా గొడవలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఒక వర్గానికి చెందిన హనీష్, హేమంత్‌లను మరో వర్గానికి చెందిన చరణ్ సుభాష్, ఫయాజ్‌లు రాత్రి 'మా వారితో గొడవ పడతారా' అంటూ కత్తులతో పొడిచారు. గాయపడిన హనీష్, హేమంత్‌లను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొదట పాలిటెక్నిక్ కాలేజీ వద్ద హనీష్, చరణ్ గ్యాంగ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఇరువర్గాలు అక్కడి నుంచి పరారయ్యాయి. తిరిగి రాత్రి టెక్కె ప్రాంతంలో ఇరువర్గాలు ఎదురెదురు పడటంతో కత్తిపోట్ల ఘటన చోటుచేసుకుంది. దాడికి పాల్పడిన చరణ్ గ్యాంగ్ పరారీలో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

7న విజయవాడలో గిరిజన శంఖారావం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజా సమాఖ్య నాయకులు

నంద్యాల టౌన్, జనవరి 4 : విజయవాడలో ఈ నెల 7వ తేదీన ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో గిరిజన శంఖారావం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. గురువారం శంఖారావం ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శంఖారావం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన హక్కుల కాపాడుకునేందుకు, వారి జీవన విధానంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో పలువురు గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు వైసీపీ టోపీ

● బలవంతంగా బస్సు యాత్రకు తరలింపు



టోపీలు, కండువాలు ధరించిన పొదుపు మహిళలు

పాణ్యం, జనవరి 4 : వైసీపి కర్నూలులో నిర్వహించిన సాధికార యాత్రకు పాణ్యం మండలం నుంచి పొదుపు మహిళలను తరలించారు. గురువారం వెలుగు ఏపీఎం, సీసీలు, వీఓఏలు తప్పనిసరి గా పొదుపు మహిళలు యాత్రలో పాల్గొనాలని ఆదేశించడంతో పొదుపు మహిళలు కర్నూలుకు బయలుదేరారు. గోనవరం, బలపనూరు, పాణ్యం, కొనిదేడు తదితర గ్రామాల నుంచి మహిళలను బలవంతంగా తరలించారు. బస్సు ఎక్కగానే వైసీపీ నాయకులు పొదుపు మహిళల తలపై వైసీపీ టోపీ. కండువాలు వేయడంతో మహిళలు అవాక్కయిపోయారు. తప్పని పరిస్థితుల్లో బస్సు యాత్రకు వెళ్లాల్సి వచ్చిందని పొదుపు మహిళలు పేర్కొన్నారు. బస్సు యాత్ర ప్రభుత్వానిదా లేక వైసీపీ పార్టీదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేటి నుంచి సమగ్ర సర్వే తప్పులపై రీ సర్వే

మహానంది, జనవరి 4: మండలంలో జరిగిన భూ సమగ్ర సర్వేలో తప్పులను తిరిగి రీ సర్వేను ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ జనార్దన్‌శెట్టి గురువారం తెలిపారు. 5న బసవాపురం సచివాలయంలో,6న నందిపల్లి దర్గా వద్ద, 8 న సీతారామపురం గ్రామ సచివాలయం వద్ద 9న మసీదుపురం గ్రామసచివాలయంలో గ్రామ సభలు నిర్వహించి తప్పు ఒప్పులు సరిచేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

ఆత్మకూరు, జనవరి 4: ఆత్మకూరు పట్టణంలోని 10వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, ఆటోనగర్ కార్యదర్శి కట్టల రఫీక్ గుండెపోటుతో మృతిచెందడంతో గురువారం ఆయన మృతదేహాన్ని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పార్టీ తరుపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈయన వెంట టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు అబ్దుల్లాపురం బాషా, న్యామతుల్లా, నబిరసూల్, బీ.అన్వర్, ఖాజామోహిద్దిన్, ఫ్రూట్ రఫీక్, రియాజుద్దిన్, కొయ్యహోటల్ మున్నా, జిలానీ, కలీం తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జనవరి 4: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం వద్ద నెలకొల్పిన దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించి అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాణ్యం, జనవరి 4 : మండలంలోని బలపనూరు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో నంద్యాల మండలం పుసులూరు గ్రామానికి చెందిన ప్రసాద్ (30) మృతి చెందినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. బలపనూరు నుంచి కౌలూరుకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి పాణ్యం వైపు వెళ్తున్న మోటారుసైకిల్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న జీపు : స్థానిక బస్టాండు సమీపంలో గురువారం జీపు ఆటోను ఢీకొనడంతో ప్రయాణీకులు గాయపడ్డారు. నంద్యాల వైపు నుంచి పాణ్యం వైపు వెళ్తున్న ఆటోను వెనుక వైపునుంచి జీపు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలోని ప్రయాణీకులు గాయపడినట్లు హైవే పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలి

పాములపాడు జనవరి 4 : పాములపాడులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా లే అవుట్‌లు వేసి అక్రమ వ్యాపారాలకు తెరలేపారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత నాగరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమినుంచి ల్యాండ్ కన్వెన్షన్ చేసుకోవాలని, గ్రామపంచాయతీ కుడా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

నంద్యాల టూ టౌన్ సీఐగా రాజారెడ్డి



ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టూ టౌన్ సీఐ రాజారెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 4 : నంద్యాల టూ టౌన్ సీఐగా కె.రాజారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లా ప్రొద్దుటూరులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజారెడ్డి నంద్యాల టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజారెడ్డికి టూ టౌన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ కట్టడాలను పరిశీలించిన విజిలెన్స్ సీఐ

నంద్యాల క్రైం, జనవరి 4 : నంద్యాల పట్టణంలోని కొన్ని అక్రమ కట్టడాలను విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. గత ఏడాది నంద్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం వారు కొన్ని కట్టడాలకు అనుమతులు ఇచ్చిన వ్యవహారంలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు వెలుగుచూసింది. ఈ క్రమంలో విజిలెన్స్ సీఐ తన సిబ్బందితో అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ వ్యవహారం ఆటు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంతోపాటు భవనాల యజమానులను కూడా కలవరానికి గురిచేసినట్లు సమాచారం.

శ్రీరాముని అక్షింతల పంపిణీ

వెలుగోడు జనవరి 4 : మండల కేంద్రంలో అయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసినట్లు మండల విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణగుప్తా తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో మహిళలు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు...

అండగా ఉంటాం

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెను ప్రభుత్వం నిరంకుశంగా అణచాలని చూస్తోందని, అధైర్య పడొద్దని విజయం సాధించే వరకు మీ పోరాటానికి అండగా ఉంటామని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు ఏరాసు ప్రతాపరెడ్డి అంగన్‌వాడీ వర్కర్లకు భరోసా ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక దీక్షలు గురువారం నాటికి 24వ రోజుకు చేరాయి. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా నిలుస్తున్నారు. వెలుగోడులో అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పాణ్యంలో జరిగిన దీక్షలో అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. సీఎం మనసు మార్చాలని ప్రార్థిస్తూ పొర్లుదండాలు పెట్టారు. జూపాడుబంగ్లాలో పింఛన్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌ను ముట్టడించి తమకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహానందిలో అంగన్‌వాడీల పోరాటానికి హిజ్రాలు మద్దతుగా నిలిచారు. 'మేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదు.. సీఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు, సుప్రీం కోర్టు తీర్పునుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మాత్రమే కోరుతున్నాం' అంటూ అంగన్‌వాడీలు పేర్కొన్నారు. -(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



వెలుగోడులో అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి



జూపాడుబంగ్లాలో ఎమ్మెల్యే ఆర్థర్‌ను చుట్టుముట్టిన అంగన్‌వాడీ వర్కర్లు



పాణ్యంలో సీఎం జగన్ మనస్సు మార్చాలని ప్రార్థిస్తూ పొర్లుదండాలు పెడుతున్న దృశ్యం



ఆత్మకూరులో దున్నపోతుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

తిరుగుబాటు తీవ్రమవుతోంది : ఫరూక్



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జనవరి 4: ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక సీఎం జగన్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను మారుస్తున్నారని, ఈ సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తిరుబాటును జగన్ తట్టుకోలేరని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, టీడీపీ నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జీ ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఫరూక్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేస్తున్నారని, వైసీపీలోని చాలా మంది ఎంపీలు తమ రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో వారికే అర్థం కాక ఆవేదనతో ఉన్నారని, జగన్ ఇప్పటి వరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చరని పేర్కొన్నారు. జగన్‌రెడ్డిని నమ్ముకుంటే రాజకీయ భవిష్యత్తు అంధకారమే అని భావించి పార్టీ మారే ప్రయత్నాలు చేసుకుంటున్నారని తెలిపారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాజీనామా చేసే వారిని పార్టీలో నిలిపేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు కామిని మల్లికార్జున, చంద్రారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, పీడీ హుసేన్, పిట్టల మదార్‌సా పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించుకుందాం : మాజీ ఎమ్మెల్యే భూమా



గోస్పాడులో మాట్లాడుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి

గోస్పాడు : త్వరలో జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోస్పాడు, జిల్లెల్ల, యాళ్లూరు, రాయపాడు, జూలేపల్లె గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాల నాయకులతో కలిసి మాట్లాడారు. అధికార వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని అన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు అవసరం ఉందని ప్రజలు గ్రహించారని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఏరాసు చంద్రశేఖర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి ఆగని వలసలు





మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ముస్లిం మైనార్టీలు, ఎస్టీలు

- బుడ్డా సమక్షంలో గుంతకందాల వైసీపీ నేతల చేరిక
- మరోచాన్స్ ఇచ్చి మోసపోవద్దంటూ పిలుపు

వెలుగోడు జనవరి 4 : జిల్లాలో వైసీపీ నేతలు తిరుగుబాటు బావుటా ఎగరవేస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రధాన నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వలసలు కట్టారు. గురువారం వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఎస్టీ కాలనీలో మాజీ సర్పంచ్ స్వామినాయక్, వెంకటేశ్వర్లు నాయక్, లక్ష్మణ్ నాయక్, మున్న నాయక్‌ల ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు చేరాయి. అలాగే చిన్న మౌలాలి, హుశేన్‌సాహెబ్, నూరుల్లా, చిన్నజావలి ఆధ్వర్యంలో మరో 20 కుటుంబాలు చేరాయి. ఈ సందర్భంగా బుడ్డా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌రెడ్డి ఒక్కచాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, మరోచాన్స్ ఇచ్చి మోసపోవద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ గాండ్ల శివన్న, మాజీ ఎంపీపీ ఎల్లాల క్రిష్టుడు, అన్నారపు శేషిరెడ్డి, అబ్దులుకలాం, లీల్, రసూల్, భూపాల్ చౌదరి, నాగశేఖర్, చిన్న శ్రీనివాసులు పాల్గొన్నారు.

అడవి బిడ్డల ఆరోగ్యం పట్ల జాగ్రత్త

కొత్తపల్లి, జనవరి 4: అడవి బిడ్డలు ఆరోగ్యం పట్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతారావు నాయక్ సూచించారు. గురువారం ఎర్రగుంట్ల గిరిజన గూడెంను సీహెచ్‌వో బాలకృష్ణ వైద్యసిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సమక్షంలో 48 మంది గిరిజనులకు రక్తహీనత (స్కిల్ సెల్) పరీక్షలు నిర్వహించగా.. నెగిటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. గిరిజనులకు రక్తహీనత ఉన్నట్లు గుర్తిస్తే నెలకు ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ ఇస్తుందని చెప్పారు. ఏదైనా చిన్నపాటి జబ్బు చేసినా సమీపంలో ఉన్న వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను అకస్మిక తనిఖీ చేశారు. వంటశాలను, మినరల్ వాటర్ ప్లాంటును పరిశీలించి నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థినులకు న్యాప్‌కిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి దీపానాగవేణి, సీహెచ్‌వో బాలకృష్ణ, సీహెచ్ఎం ఆయేషా భేగం తదితరులు ఉన్నారు.

సురక్ష క్యాంపు పకడ్బందీగా నిర్వహించండి : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 4: అన్ని మండలాలలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఏపీ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష,స్త్రీ శిశు సంక్షేమం, అంగన్‌వాడీల పనితీరు, రీసర్వే మూడవ దశ, ఇనామ్,అసైన్డ్ భూములు, కరువు, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్షక్యాంపుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రీసర్వే పనులను వేగవంతం చేసి స్టోన్‌ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ సేవలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీని కలెక్టర్ ఆదేశించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధించడం తగదు



సమగ్ర శిక్షా ఉద్యోగుల శిబిరం వద్ద మాట్లాడుతున్న న్యాయవాది శంకరయ్య

నంద్యాల (నూనెపల్లె), జనవరి 4: ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని వేధించడం ప్రభుత్వానికి తగదని న్యాయవాది, ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ శంకరయ్య అన్నారు. నంద్యాలలో సమగ్ర శిక్షా విభాగాలలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారం దీక్షా శిబిరాన్ని శంకరయ్యతో పాటు సీఐటీయు నాయకులు సందర్శించి ప్రసంగించారు. చట్ట ప్రకారం 21 రోజుల ముందు సమ్మె నోటీసులు ఇచ్చి న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను స్టేట్ ప్రాజెక్టు అధికారి దుర్భాషలాడటం సరైన పద్ధతికాదని అన్నారు. ప్రాథమిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని, ఉన్నతాధికారులు మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను, జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా కార్యదర్శి నాగరాజు, వెంకట్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు



అంధుల పాఠశాలలో లూయిస్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 4: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ మహబూబ్‌బాష, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డిలు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా క్రాంతినగర్‌లోని జీవన జ్యోతి అంధుల పాఠశాలలో బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేశారు. ప్రపంచానికి అపురూపమైన లిపిని అందించి అంధులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు దోహదపడ్డారని కొనియాడారు. లిపి ద్వారా విద్యావంతులైన అంధులు వివిధ రంగాలలో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలలో రాణిస్తున్నారని చెప్పారు. దాతల సహాయంతో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలకు అర్పిత రూ.25 వేలు, డాక్టర్ రామకృష్ణారెడ్డి రూ.30 వేలు విలువ చేసే నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. డాక్టర్ మహబూబ్‌బాష పాఠశాలలోని అంధ విద్యార్థులకు బియ్యం సంచులను అందజేశారు. అంధ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, దాతలు, అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి తైక్వాండో సబ్-జూనియర్ పోటీలు

నంద్యాల క్రైం, జనవరి 4 : ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 (ఆదివారం)న జిల్లా స్థాయి తైక్వాండో సబ్-జూనియర్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బిలాల్ గురువారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, కోచ్‌లతో నంద్యాల ఇండోర్ స్టేడియంలో లేదా సీనియర్ తైక్వాండో మాస్టర్ గౌస్ .9885150949ను సంప్రదించాలని సూచించారు.

గర్భిణులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి

ఆత్మకూరురూరల్, జనవరి 4 : ఆశాలు గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ,వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, వైద్యాధికారి పవన్‌కుమార్‌లు సూచించారు. గురువారం ఈ మేరకు పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో గర్భిణుల పర్యవేక్షణపై పలు సూచనలు చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఆత్మకూరు, జనవరి 4: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను గురువారం మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధుల నుంచి రూ.6లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మారుబోతుల విజయ్‌కుమార్, కురుపాటి విజయ్‌చౌదరి, మాజీ కౌన్సిలర్ లాలు తదితరులు ఉన్నారు.

అరబిక్ కళాశాలలో తరగతులు ప్రారంభం : ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో ఉన్న మదరసా మదీనా తూల్ ఉలూం కళాశాల నందు ఇటీవల నిర్మించిన నూతన గదుల్లో తరగతులను ప్రారంభించినట్లు మదరసా కమిటీ చైర్మన్ ఎంఏ.రషీద్ తెలిపారు. కళాశాలలో తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మౌలానాలు రహంతుల్లా, ముర్తుజా, మదరసా సెక్రటరీ జాకీర్ హఫీజ్ సాహేబ్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సహకరించాలి

ఆత్మకూరు, జనవరి 4: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికై అన్ని విభాగాల ఉద్యోగులందరూ బాధ్యతగా సహకరించాలని డిపో మేనేజర్ మహేంద్రుడు అన్నారు. గురువారం గత డిసెంబరు నెలలో అత్యధికంగా ఇంధనాన్ని పొదుపు చేసిన డ్రైవరు శివారెడ్డి, ఎస్‌కే.వలి, ఎంఏ.నాయక్, కేఏ.మాలిక్, దర్గయ్య, మధుసూదన్‌లతో పాటు అత్యధికంగా ఆదాయం తెచ్చిన కండక్టర్లు అనురాధ, జీఎస్.ప్రతాప్, ఈఎస్ లక్ష్మీ, రామలింగారెడ్డి, కే.గోవిందయ్య, జీ.వెంకటస్వామి, సీహెచ్ఏకే.మోహన్, పీఎం.జ్యోతి, ఎస్ఎస్.బాషాలకు నగదు ప్రోత్సాహక బహుమతులను, ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధిలో ఇంధన పొదుపు ఎంతో కీలకమని అన్నారు. అదేవిధంగా ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలతో పాటు మర్యాదపూర్వకంగా మెలిగి ఆదాయ రాబడి తీసుకురావాలని సూచించారు.

కొలతల ప్రకారం ఉపాధి వేతనాలు ఇవ్వాలి

కొత్తపల్లి, జనవరి 4: ఉపాధి కూలీలకు కొలతల ప్రకారం వేతనాలు ఇవ్వాలని అంబుడ్స్‌మెన్ సురేంద్రనాథ్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మండలంలోని దుద్యాల గ్రామ శివారులో కూలీలు చేస్తున్న ఉపాధి పనులను ఏపీవో రేష్మా, ఈసీ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ముందుగా ఆయన ఉపాధి కూలీల మస్టర్‌ను పరిశీలించి వేతనాలు అందుతున్నాయా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు.

తగ్గేదేలేదు

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే
- 10వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె



ఆత్మకూరులో చెవిలో పువ్వులు పెట్టుకొని మున్సిపల్ కార్మికుల నిరసన

నంద్యాల టౌన్, జనవరి 4 : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదని సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరింది. సీఐటీయూపట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి భాస్కరాచారి వైసీపీ ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం తప్ప సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వ పెద్దలకు లేదని విమర్శించారు. కార్మికులు మరింత ఐక్యమత్యంతో పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ కార్మికుల సమ్మె రెండవ రోజు సందర్భంగా సంజీవనగర్ గేటు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఆత్మకూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహారదీక్షల్లో చెవిలో పువ్వులు పెట్టుకుని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు, నాయకులు తిమ్మయ్య, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: పట్టణంలో కొనసాగుతన్న మున్సిపల్ వర్కర్ల నిరవధిక సమ్మెకు జనసేన నాయకులు నల్లమల రవికుమార్ మద్దత్తు ప్రకటించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, యూనియన్ నాయకులు పరమేష్, బాష్కర్, గోపాలక్రిష్ణ, రైతు సంఘం నాయకులు రాజు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అంగన్‌వాడీల బాధలు పట్టవా?

● టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

● సమ్మెకు మద్దతు తెలిపిన నాయకులు


డోన్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి


ఆళ్లగడ్డలో..


శిరివెళ్లలో..

డోన్, జనవరి 4: అంగన్‌వాడీల బాధలు వైసీపీ ప్రభుత్వానికి కనిపించవా? అని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారంఅంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన చేపట్టిన సమ్మెకు సుబ్బారెడ్డి సంఘీభావం తెలిపారు. అలాగే కోర్టు ఎదుట మహిళా న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు రూ.26వేలకు పెంచడంతో పాటు మిగతా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థిరాస్తుల తగాదాలకు సంబంధించి సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పిస్తూ తీసుకువచ్చిన 512 జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, న్యాయవాదులు, మున్సిపల్ కార్మికుల పోరాటానికి టీడీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. టీడీపీ లీగల్ సెల్ కమిటీ సభ్యులు మధుసూదన్‌గౌడు, ఆలా మల్లికార్జున రెడ్డి, మహేశ్వరరెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, మండల కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలో అంగన్‌వాడీలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి వెల్దుర్తి రోడ్డులోని కొలుములపల్లె ట్యాంకు వద్ద దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. డిమాండ్లను నెరవేర్చే దాకా సమ్మె విరమించేది లేదన్నారు.

శిరివెళ్ల: అంగన్‌వాడీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. సీఎం జగన్ డౌన్ డౌన్ అంటూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు గురువారం నినాదాలు చేశారు. శిరివెళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు చేపట్టిన నిరవధిక సమ్మె 24వ రోజుకు చేరుకుంది.

చాగలమర్రి: చాగలమర్రిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు, హెల్పర్లు కలిసి వినూత్నంగా చెడు మాట్లాడకు, చెడు వినకు, చెడు చూడకు అంటూ కళ్లు వినూత్న నిరసన చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వినూత్న నిరసన చేపట్టారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

రుద్రవరం: రుద్రవరం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో గురువారం 24వ రోజు అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్ వాడీల సమ్మె 24వ రోజుకు చేరింది. గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌న నాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. గురువారం మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంజామల: సంజామలలో గురువారం పాత ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా నిరసన చేపట్టారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలను విస్మరించారని, నెరవేర్చేంత వరకు సమ్మె ఆగదని అన్నారు.


బేతంచెర్లలో దున్నపోతుకు వినతి పత్రం



రుద్రవరంలో.


చాగలమర్రిలో కళ్లు, చెవులు, నోరు మూసుకుని నిరసన


కోవెలకుంట్లలో మోకాళ్లపై నిరసన


దొర్నిపాడులో..

'జయహో బీసీ' సదస్సులో జిల్లా నాయకులు


బీసీ సదస్సులో పాల్గొన్న గోగిశెట్టి నరసింహారావు

ఆళ్లగడ్డ, జనవరి 4: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సదస్సులో జిల్లాకు చెందిన నాయకులు హాజరయ్యారు. టీడీపీ నాయకుడు గోగిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ బీసీలకు, ఉప కులాలకు టీడీపీ సముచిత స్థానం కల్పించిందని గుర్తు చేశారు. విభజన ఏపీలో అధికారంలో ఉన్నపుడు బీసీలకు రాజకీయ పదవులు, మంత్రి పదవులు ఇచ్చిందన్నారు. వైసీపీ హయాంలో బీసీలకు చేసింది శూన్యమని అన్నారు. ప్రస్తుతం బీసీల స్థానాలను ఇతర సామాజిక వర్గాలకు సీఎం జగన్ కేటాయిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు.

డోన్: చరిత్రను మళ్లీ తిరగరాసేలా టీడీపీ జయహో బీసీ నిలిచి పోయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ వర్క్‌షాపునకు హాజరయ్యారు. వీరితో పాటు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు గోసానిపల్లి మల్లయ్య తదితరులు తరలివెళ్లారు.


జయహో బీసీ సదస్సులో డోన్ నియోజకవర్గ నాయకులు

'చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి'

చాగలమర్రి, జనవరి 4: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 9న ఆళ్లగడ్డకు వస్తున్నారని, టీడీపీ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, అజీమ్, శ్యాబుల్, సుబ్బారావు, గఫార్, అబ్దుల్‌ఖాదర్, నూర్‌బాషా, రవి, బషీర్, లడ్డుబాషా పాల్గొన్నారు.

ఖవ్వాలి కళాకారులకు టీడీపీ నాయకుల సత్కారం

బనగానపల్లె, జనవరి 4: పట్టణంలోని పాతబస్టాండ్‌లో వెలసిన శ్రీహజరత్‌సయ్యద్ సిద్దికి జలాల్ హజరత్ సయ్యద్ ఉరుసు సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలి కళాకారులను టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు అహమ్మద్‌హుస్సేన్, నియాజ్ గురువారం సత్కరించారు. ఖవ్వాలి కార్యక్రమం నిర్వహణకు రూ.1లక్ష విరాళం అందించిన దాత మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి, ఉర్సు సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, అబ్దుల్ ఖాదర్, ఈద్గా మహమ్మద్‌రఫి, జాఫర్‌హుసేన్, నాసిర్‌హుసేన్, అమీర్‌జాన్, ఖాజాఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా విద్యకు నాంది పలికిన సావిత్రీబాయి పూలే'

బనగానపల్లె, జనవరి 4: మహిళా విద్యకు నాందిపలికిన వీరవనిత సావిత్రీబాయి పూలే అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. గురువారం బనగానపల్లెలోని ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయిని విజయలక్ష్మిని సత్కరించారు. రాష్ట్ర కౌన్సిలర్లు వి.సుబ్బరాయుడు, జె.రామకృష్ణ, పి.సుబ్బరాయుడు, బనగానపల్లె మండల అధ్యక్షుడు వెంకటకృష్ణుడు, బేతంచెర్ల మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నేడు యాగంటి హుండీ ఆదాయం లెక్కింపు

బనగానపల్లె, జనవరి 4: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర ఆలయంలో ఈనెల 5 వతేదీ శుక్రవారం ఆలయ హుండీలను లెక్కిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ఆలయ హుండీని భక్తుల సమక్షంలో లెక్కిస్తున్నట్లు వారు తెలిపారు.

'ప్రజా సంక్షేమమే ధ్యేయం'

రుద్రవరం, జనవరి 4: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కొత్తగా మంజూరైన 103 పింఛన్‌లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బాలస్వామి, గంగిశెట్టి తిమ్మయ్య, నాగమణి, సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నంద్యాలలో ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

బేతంచెర్ల, జనవరి 4: వైసీపీ ప్రభుత్వంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేస్తున్నట్లు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేకల నాగరాజు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్ అధ్యక్షతన నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ సీఎం జగన్ క్రైస్తవులకు జరిగిన అన్యాయంపై ప్రతి పార్లమెంటులో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, అందులో భాగంగా నంద్యాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బొమ్మల సత్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా ఉంటుందని తెలిపారు. క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, నంద్యాల మధు, భూషణం, కానాల అంజి, మంచినీళ్ల సుమంత్, కార్యకర్తలు పాల్గొన్నారు

'చెంచుల అభివృద్ధికి కృషి'

రుద్రవరం, జనవరి 4: చెంచుల అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీశైలం ఐటీడీఏ పీటీజీ రవీంద్రరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆలమూరు అంకాలమ్మ చెంచుగూడెం సందర్శించారు. చెంచులతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గూడెంలోని సమస్యలను చెంచులు పీవో దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారుల ద్వారా మీ సమస్యలు పరిష్కరిస్తామని చెంచులకు హామీ ఇచ్చారు. వ్యవసాయం చేసుకోవడానికి వ్యవసాయ భూమి ఇప్పించాలని చెంచులు కోరారు. ఈ సమస్యను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రధానమంత్రి జన్మన్ జనజాతి ఆదివాసి న్యాయమహాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చెంచుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లత, వైకేపీ ఇన్‌చార్జి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు నాయక్, కమ్యుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'


బనగానపల్లెలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ


బేతంచెర్లలో మేనిఫెస్టో గురించి వివరిస్తున్న సుబ్బారెడ్డి

బేతంచెర్ల, జనవరి 4: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం నగర పంచాయతీ 12వ వార్డు మంగళగిరి కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్మూర్తి, షేక్షావలి ఆధ్వర్యంలో సుబ్బారెడ్డి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మేకల నాగరాజు, రాంగోపాల్, నంద్యాల మధు, కేపీ భూపాల్ రెడ్డి, మాదినేని నారాయణ స్వామి, వేణుగోపాల్ రెడ్డి, ఎంఎస్ కుమ్మరి శ్రీనివాసులు, లోకేశ్‌గౌడు, వంశీకృష్ణ, పట్టణ ఐటీడీపీ అధ్యక్షుడు అరుణ్ కుమార్, గూటం శివ, మురళి, జనార్దన్, జగదీష్, కానాల అంజి, సుమంత్, పోలా మధు, ఆలా తిరుమలేష్, నజీర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

● బేతంచెర్ల మండలంలో టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ కలిసి కట్టుగా ఐక్యంగా కృషి చేయాలని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. మద్దయ్య, పోలూరు వెంకటేశ్వరరెడ్డి, ఉన్నం ఎల్లనాగయ్య, బుగ్గన ప్రసన్న లక్ష్మి, ఉన్నం చంద్రశేఖర్, షేక్షావలి చౌదరి, ఉన్నం సుధాకర్, తిరుమలేష్ చౌదరి, జాకీరుల్లా బేగ్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి వారికి న్యాయం చేస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని భానుముక్కలలోని రాంభూపాలనగర్‌లో బీసీ ఇందిరమ్మ బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ పథకంలో భాగా ఇంటింటి ప్రచారం చేశారు. మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షింతలు

ప్యాపిలి, జనవరి 4: పట్టణంలో గురువారం ఇంటింటికి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు.

ఓటింగ్‌పై అవగాహన

ఆళ్లగడ్డ, జనవరి 4: వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై వయో వృద్ధులకు నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన తహసీల్దార్ల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు పరిశీలించి వాటిల్లో ఓటర్లకు కనీస అవసరాలైన మంచినీరు, విద్యుత్, ర్యాంపులు వంటి వాటి కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే గ్రామాల్లో సభలు

రుద్రవరం, జనవరి 4: మండలంలో ఫేజ్-2 భూ రీసర్వే చేసిన గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు గురువారం డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా తెలిపారు. 5న లింగందిన్నె, 6న శ్రీరంగాపురం, 8న చిలకలూరు, 9న మందలూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తమ సమస్యలు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


'పరిశ్రమలు ఏర్పాటు చేయాలి'


బేతంచెర్ల, జనవరి 4: పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును, సబ్ రిజిస్టర్ ఆఫీసును ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, నియోజకవర్గ సమన్వయకర్త డా.గార్లపాటి మద్దిలేటి కోరారు. గురువారం డోన్ నియోజకవర్గ పరిధిలోని బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం, కె.కొట్టాల, నాగమల్లకుంట గ్రామాల్లో గురువారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని బేతంచెర్ల మండలం అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ చాలా పరిశ్రమలు నష్టపోయి అప్పులు చేసుకుని అనేక మంది పారిశ్రామికవేత్తలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాయకులు జనార్దన్, బోయ రమణ, న్యాయవాది పి.జీవన్‌బాబు, సుబ్బు యాదవ్, రామాంజనేయులు వడ్డె రాజశేఖర్, లోక్‌నాథ్, నాగరాజు, మల్లికార్జున, మధు, జి.మధుసూదన్, మహేష్, బోయ సూర్యనారాయణ, బషీర్, మీరా మోహిద్దీన్ పాల్గొన్నారు.

'రైతులకు నష్టపరిహారం చెల్లించాలి'

బనగానపల్లె, జనవరి 4: కరువుబారిన పడిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, ఇమాంసా, సంజీవులు, శివనాగయ్య డిమాండ్ చేశారు. బనగానపల్లెలో గురువారం వారు మాట్లాడుతూ ఈనెల 6న బనగాన పల్లెలో జిల్లా ప్రథమ రైతుసంఘం మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కరువుబారిన పడ్డ రైతులకు ఎకరాకు రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 400 మండలాలు కరువుబారిన పడితే కేవలం 106 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమన్నారు.

'మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'


డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు



డోన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆకులు తింటూ నిరసన

డోన్(రూరల్), జనవరి 4: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు లక్ష్మీనారాయణ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్వర్, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి రణత్ యాదవ్ హెచ్చరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు పుల్లయ్య, అబ్బాస్, ఆటో వర్కర్స్ యూనియన్, నాయకులు, మున్సిపల్ వర్కర్స్ నాయకులు పాల్గొన్నారు.

● సీఐటీయూఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆకులు తింటూ డోన్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. సీపీఎం, సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పనికి తగిన వేతనాన్ని అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం ఆళ్లగడ్డలో మెడకు ఉరి వేసుకొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.


ఆళ్లగడ్డలో ఉరి వేసుకొని నిరసన

మద్యం పట్టివేత

డోన్(రూరల్), జనవరి 4: పట్టణంలోని పాతపేట వద్ద సెబ్ పోలీసులు భారీగా తెలంగాణ, కర్ణాటక అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. పట్టణంలోని పాతపేటకు చెందిన ఫరీద్, చిన్న అనే వ్యక్తులు కారులో అక్రమ మద్యం తరలిస్తుండగా.. సెబ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.50 లక్షలు విలువ చేసే అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భీమలింగ తెలిపారు. 386 తెలంగాణకు చెందిన మద్యం బాటిళ్లు, 96 కర్ణాటకకు చెందిన టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ తెలిపారు. నిందితులను డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సెబ్ ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా గార్లదిన్నె గ్రామంలో సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి భారీ ఎత్తున నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గార్లదిన్నె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఈశ్వరమ్మను అరెస్టు చేసి ఆమె నుంచి 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం పరుచుకున్నట్లు సెబ్ సీఐ భీమలింగ తెలిపారు. ఈశ్వరమ్మకు నాటుసారా సరఫరా చేస్తున్న ఆలేబాదు తండాకు చెందిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితురాలిని డోన్ కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ నరసింహారెడ్డి, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బేతంచెర్ల, జనవరి 4: మండలంలో ముసలాయ చెరువు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారుసైకిళ్లు ఢీకొనడంతో నక్క శ్రీను (48) అక్కడికక్కడే మృతి చెందారు. ఏఎస్ఐ లింగమయ్య గురువారం తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని సంజీవనగర్‌కు నక్క శ్రీను ముసలాయ చెరువు గ్రామానికి తన బంధువులను కలిసి తిరిగి బుధవారం రాత్రి మోటారు సైకిల్‌పై వస్తుండగా.. ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొట్టింది. మోటారు సైకిల్ పై నుంచి నక్క శ్రీను కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పశువులకు టీకాలు

ప్యాపిలి, జనవరి 4: చంద్రపల్లి గ్రామంలో గురువారం గాలి కుంటు వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేశారు. గ్రామంలోని దాదాపు వంద పశువులకు ఈ టీకాలు వేశారు. పశువైద్యాధికారులు హరీష్, చంద్ర మోహన్ పశువులకు వైద్యం చేశారు. వైద్యులు మాట్లా డుతూ ఈ నెల 31 వరకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ సరోజమ్మ, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీఈఆర్ సర్వేపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, జనవరి 4: చాగలమర్రిలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి గురువారం మిషన్ జీఈఆర్ సర్వేపై అవగాహన ర్యాలీ చేశారు. పురవీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో న్యామతుల్ల మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని సూచించారు. పిల్లలను బడికి పంపించడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. బడిమానివేసిన పిల్లలను బడికి పంపించేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. అలాగే ముత్యాలపాడులోని బర్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీఈఆర్ సర్వేపై తల్లిదండ్రులకు నాటకాలు, గేయాల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయలక్ష్మి, సింధూర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

చాగలమర్రి, జనవరి 4: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మి ఆగ్రోటెక్ ఎరువుల దుకాణాన్ని గురువారం ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది తనిఖీ చేశారు. ఎరువుల రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల శాంపిల్స్‌ను సేకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. రైతులు ఎరువులు కొనుగోలు సమయంలో బిల్లులు తీసుకోవాలని సూచించారు.

అవయవ దానంపై అవగాహన

బనగానపల్లె, జనవరి 4: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ మధు మౌనిక, జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి సూచించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవయవదానం కరపత్రాలు పంపిణీ చేసి పలువురికి అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ అవయవదానం మహాదానం అన్నారు. మనుషులు మృతి చెందినప్పుడు కళ్లు తదితర వాటిని ఇతరులకు దానం చేసి చూపు ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉబ్బరాయుడు, సిబ్బంది గంగానాగేశ్రీ, సరళగంగ, ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుబ్బుయాదవ్

ప్యాపిలి, జనవరి 3: మండలంలోని ఊటకొండ గ్రామానికి చెందిన ఎంఎస్ సుబ్బుయాదవ్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గురువారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.